


జూలై 1 స్పెషల్
నేడు ఎన్నెన్ని 'రోజు'లో... అన్నీ ప్రత్యేకమే..! - 5లో

వృద్ధాప్య పెన్షన్ రూ.3వేలు నుంచి రూ.4వేలకు పెంపు
లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ అందజేత
పంపిణీకి 4,247 మంది సిబ్బంది
తొలి రోజు నూరు శాతం అందేలా చర్యలు



నేడే పెన్షన్ల పండగ

అమలాపురం టౌన్, జూన్ 30:
ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలుకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వృద్ధులతో పాటు అన్ని వర్గాల వారికి ఇచ్చిన హామీ మేరకు పెన్షన్ సొమ్ము పెంచారు. రాష్ట్రం ఆర్థికంగా అప్పుల ఊబిలో కూరుకుపోయినప్పటికీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తొలి నెల నుంచే అమలు చేయనుంది. వృద్ధాప్య పెన్షన్‌ను రూ.3వేలు నుంచి రూ.4వేలుకు పెంచడంతో పాటు అన్ని రకాల పెన్షన్‌లను భారీగా పెంచేశారు. అంతే కాకుండా ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ వృద్ధులకు ఎన్నికల సమయంలోని మూడు నెలలకుసంబంధించి పెన్షన్‌దారునికి అదనంగా రూ.3వేలు తొలి నెలలో అందజేయనున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద పెంచిన పెన్షన్లను జిల్లాలోని 515 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పంపిణీ చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అంటే వృద్ధాప్య పెన్షన్ కింద ఒక్కో లబ్ధిదారునికి సోమవారం రూ.7వేలు అందజేయనుండడంతో పల్లె, పట్టణమన్న బేధం లేకుండా అన్నిచోట్లా పండగ వాతావరణం నెలకొంది. ఒకటో తేదీ కోసం పెన్షన్‌దారులు ఎప్పుడు తెల్లారుతుందా అని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో కూటమి శ్రేణులు కూడా పాల్గొనాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఇప్పటికే పిలుపునిచ్చారు.

పెన్షన్ సొమ్ము భారీగా పెంపు...

జూలై నెల నుంచి దివ్యాంగులతో పాటు అనారోగ్య బాధితులకు ఇచ్చే నెలవారీ పెన్షన్లను భారీగా పెంచేశారు. దివ్యాంగులకు ఇచ్చే పెన్షన్ రూ.3వేలు నుంచి రూ.6వేలకు పెంచడం ద్వారా రూ.32,681 మందికి అదనపు లబ్ధి చేకూరనుంది. మల్టీ డిఫార్మిటీ లెప్రసీ పెన్షన్లు 122 ఉన్నాయి. వీరికి రూ.6వేలు చొప్పున పెన్షన్ అందనుంది. పూర్తిగా దివ్యాంగత్వం కలిగినవారు 367 మంది ఉండగా వారికి రూ.5వేలు నుంచి రూ.15వేలకు పెంచి పెన్షన్ అందించనున్నారు. 114 మంది పక్షవాత పెన్షన్‌దారులు రూ.15వేలు అందుకోనున్నారు. మూత్రపిండాలు, తలసేమియా కేసుల పెన్షన్ కింద 112 మందికి రూ.5వేలు నుంచి పెంచిన రూ.10వేలు నగదు మొత్తాన్ని అందజేయనున్నారు.

జిల్లాలో 2,43,529 మందికి లబ్ధి...

జిల్లాలోని 22 మండలాల పరిధిలో 2,43,529 మంది వివిధ రకాల పెన్షన్‌దారులు ఉన్నారు. వీరికి జూలై 1న పంపిణీ చేసేందుకు రూ.160.89 కోట్లు నగదును ఇప్పటికే సిద్ధం చేశారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది పెన్షన్ పంపిణీ చేసే విధంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో పెన్షన్ పొందే వారి సంఖ్య

వృద్ధాప్య: 1,29,297
వితంతు: 49,806
చేనేత కార్మికులు: 5,252
కల్లుగీత కార్మికులు: 3,241
మత్స్యకారులు: 5,373
ఒంటరి మహిళలు: 4,557
సంప్రదాయ చెప్పులు కుట్టేవారు: 726
ట్రాన్స్‌జెండర్లు: 20
డప్పు కళాకారులు: 741
కళాకారులు: 164

నియోజకవర్గాల వారీగా పెన్షన్ల పంపిణీ ఇలా...

నియోజకవర్గం: అమలాపురం

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
అల్లవరం	9,517	రూ.6,29,72,000
ఉప్పలగుప్తం	8,004	రూ.5,36,18,000
అమలాపురం పట్టణం	4,598	రూ.3,14,03,500
అమలాపురం	12,302	రూ.8,05,58,000
మొత్తం	34,421	రూ.22,85,51,500

నియోజకవర్గం: రామచంద్రపురం

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
కె.గంగవరం	10,093	రూ.6,60,20,000
రామచంద్రపురం	10,628	రూ.6,90,29,500
రామచంద్రపురం పట్టణం	4,537	రూ.3,08,94,500
మొత్తం	25,258	రూ.16,59,44,000

నియోజకవర్గం: రాజోలు

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
మలికిపురం	10,729	రూ.7,01,91,500
మామిడికుదురు	3,322	రూ.2,16,75,000
రాజోలు	9,732	రూ.6,35,18,000
సఖినేటిపల్లి	10,373	రూ.6,84,88,500
మొత్తం	34,156	రూ.22,38,73,000

నియోజకవర్గం: పి.గన్నవరం

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
అయినవిల్లి	9,519	రూ.6,25,84,000
అంబాజీపేట	9,383	రూ.6,02,23,500
మామిడికుదురు	6,822	రూ.4,43,75,000
పి.గన్నవరం	10,264	రూ.6,73,52,500
మొత్తం	35,988	రూ.23,45,35,000

నియోజకవర్గం: ముమ్మిడివరం

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
ఐ.పోలవరం	10,030	రూ.6,76,06,000
కాట్రేనికోన	10,457	రూ.6,97,34,500
ముమ్మిడివరం మండలం	7,020	రూ.4,45,55,000
ముమ్మిడివరం పట్టణం	3,090	రూ.2,08,49,500
మొత్తం	30,597	రూ.20,27,45,000

నియోజకవర్గం: మండపేట

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
కపిలేశ్వరపురం	10,230	రూ.6,72,47,000
మండపేట మండలం	12,095	రూ.8,19,04.000
మండపేట పట్టణం	6,917	రూ.4,71,14,500
రాయవరం మండలం	10,242	రూ.6,72,88,500
మొత్తం	39,484	రూ.26,35,44,000

నియోజకవర్గం: కొత్తపేట

మండలం	పెన్షన్లు	లబ్ధిదారులకు అందించే నగదు
ఆలమూరు	11,174	రూ.7,44,86,500
ఆత్రేయపురం	9,832	రూ.6,40,56,000
కొత్తపేట	10,599	రూ.7,08,74,000
రావులపాలెం	12,026	రూ.8,03,79,000
మొత్తం	43,631	రూ.28,97,95,500



నేడు డిప్యూటీ సీఎం పవన్ రాక

- గొల్లప్రోలులో పింఛన్ల పంపిణీలో పాల్గొననున్న జనసేనాని
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్
- పర్యటనకు భారీ బందోబస్తు
- మూడురోజులపాటు జిల్లాలో కార్యక్రమాలు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 30: పిఠాపురం ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి రానున్న రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత కొణిదెల పవన్‌కల్యాణ్ పర్యటనకు సర్వం సిద్ధమైంది. ఇటు అధికార యంత్రాంగంతోపాటు జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి సోమవారం వస్తున్న పవన్‌కల్యాణ్ గొల్లప్రోలులోని సత్యకృష్ణ కల్యాణమండపంలో జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకోనున్నారు. పవన్ చేబ్రోలు నివాసంలో మూడు రోజులు ఉండనున్న నేపథ్యంలో అక్కడ భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు ఇంటిపై భారీ బెలూన్ ఏర్పాటు చేశారు. ఇంటివద్ద బారికేడింగ్ ఏర్పాటు చేశారు. కాగా పవన్ పర్యటన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ పరిశీలించారు. గొల్లప్రోలు హెలిపాడ్‌తో పాటు పవన్ పర్యటించే ప్రాంతాల్లో పరిశీలన జరిపి అధికారులకు సూచనలు ఇచ్చారు. ఆయన వెంట కాకినాడ ఆర్డీవో కిషోర్, డీఎస్పీ హనుమంతరావు, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి తదితరులు ఉన్నారు.

పవన్ పర్యటన సాగేది ఇలా..

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం నుంచి మూడురోజులపాటు కాకినాడ జిల్లాలో పర్యటించనున్నారు. పవన్ పర్యటన వివరాలను ఆదివారం రాత్రి అధికారికంగా వెల్లడించారు.

నేడు పింఛన్ల పంపిణీ

సోమవారం ఉదయం 6గంటలకు హైదరాబాద్‌లోని తన ఇంటి నుంచి బయలుదేరి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వెళ్తారు. 6.30గంటలకు అక్కడ బయలుదేరి రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. ఉదయం 7.30 గంటలకు అక్కడ బయలుదేరి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసానికి ఉదయం 9గంటలకు చేరుకుంటారు. తిరిగి 9.45 గంటలకు బయలుదేరి 10గంటలకు గొల్లప్రోలు పట్టణంలో సత్యకృష్ణ ఫంక్షన్‌హాలుకు చేరతారు. అక్కడ 12.30గంటల వరకూ జరిగే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని పింఛన్లు పంపిణీ చేస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి చేబ్రోలులోని నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత మధ్యాహ్నం పిఠాపురం నియోజకవర్గ జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలతో నిర్వహించే సమావేశంలో పాల్గొంటారు.

రేపు శాఖలవారీగా సమీక్ష

2వతేదీ ఉదయం 9.30గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి 10గంటలకు కాకినాడ కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 10నుంచి 11గంటల వరకు కలెక్టర్ కార్యాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో, 11 నుంచి 11.30 గంటల వరకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో, 11.30నుంచి 12గంటల వరకు రోడ్ల పరిస్థితిపై పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో, 12గంటల నుంచి ఒంటి గంట వరకు అటవీ శాఖ అధికారులతో, ఒంటి గంట నుంచి రెండు గంటల వరకు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో, అనంతరం సైన్స్ అండ్ టెక్నాలజీ అధికారులతో సమావేశమవుతారు. అక్కడి నుంచి మధ్యాహ్నం 2.30గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుంటారు. భోజన విరామం తర్వాత జనసేన ఎమ్మెల్యేలు, ఎంపీలతో సమావేశమవుతారు.

ఎల్లుండి బహిరంగ సభ

3వ తేదీ ఉదయం 10గంటలకు చేబ్రోలు నివాసం నుంచి బయలుదేరి కొత్తపల్లి మండలం ఉప్పాడ చేరుకుంటారు. 10.45గంటల నుంచి 12గంటల వరకూ సముద్రపు కోత ప్రాంతాన్ని పరిశీలిస్తారు. 12.45గంటలకు చేబ్రోలు నివాసానికి చేరుకుని పిఠాపురం నియోజకవర్గ అధికారులతో సమావేశమవుతారు. అనంతరం టీడీపీ, జనసేన ముఖ్య నేతలతో భేటీ ఉంటుంది. మధ్యాహ్నం 3.30గంటలకు చేబ్రోలు నుంచి బయలుదేరి పిఠాపురం పట్టణం ఉప్పాడ సెంటర్‌లో జరిగే వారాహి బహిరంగసభ వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 6గంటలకు అక్కడి నుంచి బయలుదేరి విజయవాడ వెళ్తారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఒక డీఎస్పీతోపాటు 8మంది సీఐలు, 20మంది ఎస్ఐలు, 200మంది సిబ్బందిని బందోబస్తు నిమిత్తం నియమించారు. ఎనిమిది రోప్ పార్టీలను రంగంలోకి దించారు.



కలెక్టరేట్ పరిపాలనాధికారి వైద్యనాథశర్మను సత్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

'అందరికీ ఆదర్శనీయుడు శర్మ'

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయి భూపరిపాలనా విధానాల పట్ల అనుభవంతో కీలకంగా వ్యవహరించి సేవలు అందించి ఆదర్శంగా నిలిచిన ఘనత కలెక్టరేట్ కో-ఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ టి.వైద్యనాథశర్మకు దక్కుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. శర్మ ఉద్యోగ విరమణ ఆత్మీయ వీడ్కోలు సభను ఆదివారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఉద్యోగ కాలంలో శర్మ సాధించిన విజయాలను వక్తలు వివరించారు. నిబంధనలు పాటించడంలో ఆయనకు ఆయనే సాటి అన్నారు. సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ముఖ్య భూమిక పోషించారన్నారు. తహసీల్దార్లకు రోల్ మోడల్‌గా నిలిచారని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శర్మతో వివిధ మండలాల్లో పనిచేసిన అనుభవాలను పలువురు పంచుకున్నారు. ఈ సందర్భంగా శర్మకు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ డాక్టర్ వి.శివశంకరప్రసాద్, కలెక్టరేట్ పరిపాలనాధికారి సీహెచ్ వీరాంజనేయప్రసాద్, పి.సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటింటికీ రేషన్

జిల్లాలో 5,47,723 కుటుంబాలకు లబ్ధి

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జూలై 1 నుంచి ఇంటింటికీ రేషన్ అందించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎండీయూ వాహనాలతోనే రేషన్ సరఫరా చేస్తున్నట్టు డీఎస్‌వో ఎ.పాపారావు తెలిపారు. జిల్లాలో 926 చౌక ధరల దుకాణాలు ఉన్నాయి. వీటి ద్వారా 5,47,723 కుటుంబాలకు ఎండీయూ వాహనాల ద్వారా నిత్యావసర వస్తువులను అందించనున్నారు. జూలై 1 నుంచి 20వ తేదీ వరకు యథావిధిగా ఎండీయూ ఆపరేటర్లే ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేస్తారు. ఎండీయూ వాహనాలు ఆయా ఇళ్లకు చేరుకునే ముందే వారికి సమాచారం అందించే విధంగా ప్రత్యేక ఆదేశాలను జారీ చేశారు. నిత్యావసర వస్తువుల పంపిణీలో జరుగుతున్న సమస్యలపై ఇప్పటికే ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. భవిష్యత్తులో మేలైన విధానాన్ని అమలు చేసేందుకు రూపకల్పన చేస్తున్నారు.

నేడు యథావిధిగా కలెక్టరేట్‌లో... జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

అమలాపురం టౌన్, జూన్ 29: కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో కూడా యథావిధిగా జరుగుతుందన్నారు. ఫిర్యాదుదారులు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు పొందాలని కోరారు.

జిల్లాలో వర్షపాతం వివరాలు...

అమలాపురం టౌన్, జూన్ 29: జిల్లాలో ఆదివారం సగటున 16.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా... సఖినేటిపల్లి 30.4, రాయవరం 1.4, ఆత్రేయపురం 12, మండపేట 4.8, రామచంద్రపురం 4.4, ఆలమూరు 12.2, రావులపాలెం 27.6, కొత్తపేట 8.2, కపిలేశ్వరపురం 13.2, కె.గంగవరం 16.4, ఐ.పోలవరం 12.8, ముమ్మిడివరం 6.2, అయినవిల్లి 13.2, పి.గన్నవరం 15.4, అంబాజీపేట 29.6, మామిడికుదురు 18.4, రాజోలు 21.2, మలికిపురం 28, అల్లవరం 17.4, అమలాపురం 13.2, ఉప్పలగుప్తం 23.2, కాట్రేనికోన 30.4

అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ఎస్పీ శ్రీధర్: కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన సదస్సు

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అట్రాసిటీ కేసుల సత్వర పరిష్కారానికి పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ సూచించారు. మహిళలపై జరుగుతున్న నేరాలతో పాటు ఇతర కేసులపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం జిల్లాలోని పోలీసు అధికారులతో ఎస్పీ సమావేశం నిర్వహించారు. మిస్సింగ్ కేసులతో పాటు గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల వివరాలను పోలీసు స్టేషన్ల వారీగా అడిగి తెలుసుకున్నారు. సక్రమంగా విచారణ జరిపాలని సూచించారు. అట్రాసిటీ కేసుల్లో ఎటువంటి అలసత్వం వహించవద్దన్నారు. పోలీసు స్టేషన్ల పరిధిలో దర్యాప్తు పూర్తయిన కేసుల్లో ఆలస్యం చేయకుండా చార్జిషీట్లు ఫైలు చేయాలన్నారు. కోర్టులో కేసు విచారణ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై ప్రతి పోలీసు అధికారి అవగాహన కలిగి ఉండాలన్నారు. లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జరుగుతున్న మోసాలపై ప్రజల్లో మరింత ప్రచారం చేసి వారిని అప్రమత్తులు చేయాలన్నారు. సైబర్ నేరాల్లో





పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రకాశరావును అభినందిస్తున్న ఎస్పీ శ్రీధర్

నమోదైన కేసులకు సంబంధించి రికవరీ జరిగేలా చూడాలన్నారు. జిల్లాలో పోలీసు గస్తీని పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ-బీట్స్ విధానాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగాలన్నారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫారం-7 కేసులు (ఓట్లు గల్లంతైన) స్థితిపై ఆరాతీసి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. పోలీసు సిబ్బంది వృత్తి నైపుణ్యాన్ని మెరుగుపరుచుకుంటూ శాస్త్రీయ పద్ధతుల్లో కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలన్నారు. నేరాలను అలవాటుగా చేసే నేరస్తులను గుర్తించి వారిపై హిస్టరీ షీట్లు తెరిచి పక్క జిల్లాల పోలీసు స్టేషన్లకు సమాచారం అందించాలన్నారు. అటువంటి వారిపై నిఘా నిరంతరం కొనసాగిస్తూ ఉండాలన్నారు. వారి ద్వారా భవిష్యత్తులో ఎటువంటి నేరాలు జరగకుండా నివారించలన్నారు. రౌడీషీట్ కలిగిన ప్రతి వ్యక్తి కదలికపైనా నిఘా ఉంచి ప్రజాశాంతికి భంగం కలగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా ముంపు ప్రాంతాల్లోని పోలీసు అధికారులు అన్నివేళలా విధులకు హాజరవుతూ సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది, ప్రాణాప్రాయం సంభవించకుండా చూడాలన్నారు. స్పీడీ ఫైలు కేసులను త్వరితగతిన తీర్పులు వచ్చేలా ప్రొసెసింగ్ పూర్తి చేయాలని ఆయా స్టేషన్ల పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. తొలుత రామచంద్రపురం అసిస్టెంట్ సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎంవీఎస్ ప్రకాశరావు దేశవ్యాప్తంగా జూలై 1 నుంచి అమలులోకి రానున్న భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్), భారతీయ సాక్ష్య అదినీయం చట్టాలపై పోలీసులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం ప్రకాశరావును ఎస్పీ శ్రీధర్ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, డీఎస్పీలు మహేశ్వరరావు, కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి

● రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



అధికారులతో పర్యాటకంపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్, గండి పోశమ్మను దర్శించుకుంటున్న దుర్గేష్

దేవీపట్నం, జూన్ 30: పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని రాష్ట్ర పర్యాటక శాఖామంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం మంత్రి దుర్గేష్ దేవీపట్నం మండలంలో పోశమ్మగండిలో పర్యటించారు. పర్యాటక బోట్లపై గోదావరి పరివాహక ప్రాంతాలను సందర్శించారు. పాపికొండలు పర్యాటకంపై సబ్‌కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్‌లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా పర్యాటకులతో సైతం పాపికొండల విహారయాత్రపై మాట్లాడారు. అనంతరం మంత్రి దుర్గేష్ విలేకరులతో మాట్లాడుతూ సరైన నిబంధనలు పాటిస్తున్నారా, గతంలో జరిగిన ఘటనల పట్ల ఏవిధంగా జాగ్రత్త చర్యలు తీసుకుంటారో పరిశీలించడానికి రావడం జరిగిందన్నారు. మొత్తం 16బోట్లు ఉండగా రెండు టూరిజం డిపార్టుమెంటుకి చెందగా 14బోట్లు ప్రయివేట్ బోట్లన్నారు. సందర్శకులతో పర్యటనపై మాట్లాడగా అనుభూతి కలిగిందని చెబుతూ కొన్ని సదుపాయాలు కావాలని అడిగారన్నారు. పర్యాటకులకు అన్నిరకాల సదుపాయాలు ఏర్పాటుచేశామన్నారు. బోట్‌సేఫ్టీ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. గుడిసె ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని వివరించారు. అలాగే మంత్రి దుర్గేష్ మాతృశ్రీ గండిపోశమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సిబ్బంది స్వాగతంపలికి ఘనంగా సత్కరించి అమ్మవారిఫొటోను బహూకరించారు.

పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

నిడదవోలు, జూన్ 30: వైసీపీ ఐదేళ్లలో పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని దాంతో ప్రాజెక్ట్ పూర్తిగా పడకేసిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో సాక్షాత్తూ జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబే పోలవరం ప్రాజెక్ట్ ఏంటో నాకే అర్థం కావడం లేదన్నారని, దీని ద్వారా గత ప్రభుత్వ విధానం ఏమిటో మనకు అర్థమవుతుందన్నారు. సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టుపై శ్వేతపత్రం విడుదల చేశారని, గత ప్రభుత్వంలో ప్రాజెక్ట్ ఒక ఇంచ్ అభివృద్ధి కూడా జరగలేదని 2014-19 మధ్య సీఎం చంద్రబాబు హయాంలోనే అభివృద్ధి జరిగిందని, తిరిగి మళ్లీ ఇప్పుడు 2024-29 వరకు ఆయన హయాంలోనే పూర్తవు తుందన్నారు. గత ప్రభుత్వానికి కాఫర్‌డ్యామ్, డయాఫ్రమ్ వాల్ అంటే ఏంటో కూడా తెలియదన్నారు. ఇప్పుడు ప్రాజెక్టును పరుగులు పెట్టించడానికి అంతర్జాతీయస్థాయికి చెందిన సాంకేతిక నిపుణుల బృందం వచ్చిందన్నారు. రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు వైజాగ్, తిరుపతి, కడియం తదితర ప్రాంతాలపై దృష్టి సారించామని దుర్గేష్ అన్నారు. వైసీపీ ప్రభుత్వం రబీలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిందని, ఎన్నికల పేరుతో రైతాంగానికి డబ్బులు ఇవ్వకుండా వెళ్లిపోయారన్నారు. కూటమి ప్రభుత్వం రైతు ప్రభుత్వమని రబీ ధాన్యం కొనుగోలు సొమ్మును రైతాంగానికి అందించేందుకు కేబినెట్ మీటింగ్‌లో చర్చించామని, అతి త్వరలోనే రైతులకు డబ్బులు అందిస్తామని మంత్రి దుర్గేష్ అన్నారు.

10 వేల సత్యదీక్షల పుస్తకాలు వితరణ



సత్యదీక్షల పుస్తకాలు ఆవిష్కరిస్తున్న ఈవో, తదితరులు

అన్నవరం, జూన్ 30: హైదరాబాద్‌కు చెందిన గోవిందమాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అచ్చువేయించిన సత్యదీక్షల పుస్తకాలను ఆదివారం దేవస్థానం ఈవో కె.రామచంద్రమోహన్ ఆవిష్కరించారు. ప్రతీ ఏటా ఆశ్వీయుజ మాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజు నుంచి కార్తీకమాసంలో వచ్చే మఖ నక్షత్రం రోజువరకు భక్తులు సత్యదీక్షలు స్వీకరిస్తుంటారు. ఈఏడాది వారికి ఉచితంగా సత్యదీక్షల పుస్తకాలు అందించాలని సుమారు 10వేల పుస్తకాలను దేవస్థానం ఈవో కు ఫౌండేషన్ సభ్యులు అల్లం సాయికుమార్, గుంటుకు రామకృష్ణలు అందించారు. ఈసందర్భంగా ఫౌండేషన్ సభ్యులను ఈవో అభినందించారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి సత్యదేవుడి మెమెంటో అందజేస్తున్న ఈవో

అన్నవరం, జూన్ 30: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి.రవీంద్రబాబు స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ ఈవో రామచంద్రమోహన్ ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా ఈవో వారికి స్వామివారి మెమెంటో, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం





అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

తునిరూరల్, జూన్30: ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తజనంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన ఆలయ పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దేవస్థానం ఏర్పాటుచేసిన క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటుచేసిన వసతి గదులు, వంట షెడ్లల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.6.77లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.



భారీ అవినీతి

మారేడుమిల్లి మండలంలోని సుందరమైన ప్రాకృతిక వనరులను ఎరగా వేసి ఎకో టూరిజం ముసుగులో రంపచోడవరం అటవీ డివిజన్లోని అధికారులు భారీ అవినీతికి పాల్పడ్డారు. ఎకో టూరిజం ప్రాజెక్టుల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు పాటించకుండా, కమిటీలను రద్దు చేసి కొత్త కమిటీలను నియమించకుండా లేని అధికారాన్ని తమకు తామే కట్టబెట్టుకుని ఎకో టూరిజం నిధులను కోట్లలో లావాదేవీలు సాగించేసి సానుకూలతల మేరకు అక్రమాలు, అవినీతికి పాల్పడిన భాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. పూర్వాపరాలు ఇలా ఉన్నాయి...

● లేని అధికారాన్ని కట్టబెట్టుకుని నిధులు డ్రా చేసిన అటవీ అధికార్లు

● సీసీఎఫ్ ఆమోదం లేకుండానే కోట్లాది రూపాయల లావాదేవీలు

● ఒక్క గుడిసె పర్యాటకం పేరుతోనే అనేక అక్రమాలు

(రంపచోడవరం)

అడవిలో ఉన్న పర్యాటక ప్రదేశాలను పర్యాటకులకు అనువుగా తీర్చిదిద్ది కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం(సి.బి.ఇ.టి) పేరుతో మారేడుమిల్లి మండలంలో వనవిహారి, జంగిల్ స్టార్, గుడిస ప్రాంతాలను అటవీశాఖకు అనుబంధంగా రూపొందించారు. ఈ కేంద్రాలను పర్యావరణ హితంగా సి.బి.ఇ.టి.కమిటీల ద్వారా నిర్వహించడం, వచ్చిన ఆదాయాన్ని కమిటీలకు పంచడం, నిధులను పర్యావరణ పరిరక్షణకు వినియోగించడం, నిర్వహణా ఖర్చులు వంటి అంశాలకు నిబంధనలకు అనుగుణంగా నిధులను వెచ్చించాలి. అయితే ఈ నిధుల వెచ్చింపు అంశాన్నే ప్రాధాన్యంగా తీసుకుని అటవీ అధికారులు మొత్తం పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని అటవీ అధికారులు వ్యవహరించి భారీగా అవకతవకలకు పాల్పడ్డారు. ఒక్క గుడిసె ఎకోటూరిజం ప్రాజెక్టునే తీసుకుంటే అక్కడ కమిటీని రద్దుచేసి కొత్త కమిటీని నియమించకుండా దాని నిర్వహణను రంపచోడవరం డివిజనల్ అధికారి, మారేడుమిల్లిరేంజ్ అటవీ అధికారి కలిసి చేపట్టారు. కమిటీ పేరుతో ఉన్న బ్యాంకు ఖాతాను తామే నడిపి, నిధులను డ్రా చేసుకునే విధంగా డీఎఫ్‌వో తనకు తానే అధికారాన్ని కట్టబెట్టుకోవడం, తద్వారా మారేడుమిల్లి రేంజ్ అధికారితో కలిసి నిధులను విచక్షణా రహితంగా డ్రా చేయడం వివాదంగా మారింది. ఇక్కడ సుమారు రూ.3 కోట్లవరకూ బ్యాంకు నుంచి డ్రా చేసిన నిధులలో చాలా వరకూ నిధులకు సరైన లెక్కలు లేవని సమాచారం.

రాజమహేంద్రవరం చీఫ్ కన్జర్వేటర్ అనుమతులు లేకుండానే తనకు తానుగా అధికారాన్ని కట్టబెట్టుకుని నిధుల లావాదేవీలకు పాల్పడటాన్ని ఇటీవల జరిగిన ఎకౌంట్స్ అధికారి పరిశీలనలో తూర్పారబెట్టారు. నిబంధనల ప్రకారం బ్యాంకు ఖాతాల్లో 50శాతం నిధులను ఉంచి తీరాలన్న అంశాన్ని కూడా ఉల్లంఘించడం, ఎకో టూరిజం నిధులను కార్యాలయాలు, నివాసాల, వాహనాల పనుల కోసం వెచ్చించడం వంటి అంశాలను గుర్తించిన సీసీఎఫ్ శాఖాపరమైన విచారణకు ఆదేశించారు. ఈ పరంపరలో శాఖాపరమైన విజిలెన్సు ఉన్నతాధికారి ఎకో టూరిజం ప్రాజెక్టులను పరిశీలించి తీగలాగి మొత్తం అక్రమాల డొంకను కదుపుతున్నారు. విశ్వసనీయ సమాచారం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి కార్యాచరణ ప్రణాళికలూ లేకుండా చేసిన ఖర్చులే వివాదంగా మారగా, మరో ప్రక్క రూ.50లక్షల నుంచి కోటి రూపాయలలోపు ఖర్చులకు సరైన లెక్కలు లేవని అటవీశాఖలోనే చర్చ సాగుతోంది. ఇదిలావుండగా ఇప్పటికే మారేడుమిల్లి అడవుల్లో చోటుచేసుకున్న అనేక అక్రమాలపై ప్రభుత్వం వద్ద చర్యలకు ఫైళ్లు సిద్ధంగా ఉన్న నేపథ్యంలో ఈ ఎకో టూరిజం భాగోతం కూడా దానికి తోడై పవన్‌కళ్యాణ్ సారథ్యంలో ఉన్న అటవీశాఖ ఎటువంటి చర్యలను తీసుకుంటుందో చూడాలి.

హోం మంత్రి ఓఎస్డీగా అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్



రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ హోం మంత్రికి ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్డీ)గా తూర్పుగోదావరి జిల్లా శాంతిభద్రతల అడిషనల్ ఎస్పీ పి.అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఎస్ఐబీ ఇంటెలిజెన్స్ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేస్తూ హోంమంత్రి వంగలపూడి అనితకు ఓఎస్డీగా నియమిస్తూ ఆర్సీ నెం.677/జీ2/2024 ద్వారా ఆదివారంరాత్రి డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. అనిల్ విశాఖ జిల్లాకు చెందినవారు. అందువల్ల పాడేరు అడిషనల్ ఎస్పీగా పనిచేస్తూ ఎన్నికల సందర్భంగా ఫిబ్రవరి 13న జిల్లాకు వచ్చారు. 2012 గ్రూప్-1 అధికారి అయిన అనీల్‌కుమార్‌కి సమర్థవంతమైన అధికారిగా పేరుంది. జిల్లాలోని ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో కీలకపాత్ర పోషించారు. కాగా, బదిలీపై ప్రభుత్వ ఆదేశాలు(జీవో) జారీ కావాల్సి ఉంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో ఆయన జిల్లా నుంచి రిలీవ్ అయ్యి నూతన బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్పీ జగదీశ్, అధికారులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

పాదగయ ఈవోగా దుర్గాభవానీ



పాదగయ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న దుర్గాభవానీ

పిఠాపురం, జూన్ 30: కాకినాడ జిల్లా పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి, సహాయ కమిషనర్‌గా ఏవీ దుర్గాభవానీ ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఈమె రాజమహేంద్రవరం దేవదాయశాఖ ఆర్జేసీ కార్యాలయంలో జ్యువలరీ వెరిఫిషన్ ఆఫీసరుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పటివరకూ పాదగయ ఈవోగా పనిచేసిన ఏసీ పులి నారాయణమూర్తి రిటైర్ కావడంతో దుర్గాభవానీకి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ దేవదాయశాఖ కమిషనరు సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు పాదగయకు వచ్చిన ఆమె కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు, అనంతరం బాధ్యతలు స్వీకరించారు. ఈవోను ఆలయ సిబ్బంది, అర్చకులు కలుసుకుని అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాదగయ పరిసరాలను పరిశీలించారు. భక్తులు, దాతలకు ఎటువంటి అసౌకర్యాలు కలుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సిబ్బంది అందరూ తప్పనిసరిగా యూనిఫారమ్ ధరించాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులతో గౌరవంగా, మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు.

జూలై 1 స్పెషల్..

నేడు ఎన్నెన్ని 'రోజు'లో.. అన్నీ ప్రత్యేకమే..!

అమలాపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మనిషి జీవితంలో ప్రతి రోజుకూ ఏదో ఒక ప్రత్యేకత ఉంటుంది. అయితే కొన్ని రోజులకు మాత్రం జాతీయ, అంతర్జాతీయస్థాయిలో ప్రత్యేకతలుంటాయి. మనిషి జీవితంలో 'పుట్టినరోజు'కు ఎనలేని ప్రత్యేకత ఉంటుంది. అలాగే సంస్థలకు, సంఘాలకు, వ్యక్తులకు కూడా కొన్ని ప్రత్యేక రోజులుంటాయి. అటువంటి ప్రత్యేకత కలిగిన రోజులలో జూలై 1ని ప్రత్యేకంగా చెప్పుకోవాలి. జూలై 1 అనగానే గ్రామీణ ప్రాంత వైద్యుల నుంచి అంతర్జాతీయస్థాయిలో కీర్తినార్జించిన డాక్టర్ల వరకూ అంతా 'వైద్యుల దినోత్సవం'గా జరుపుకుంటారు. డాక్టర్ బీసీ రాయ్ జయంతిని డాక్టర్స్ డేగా ఏటా నిర్వహించుకుంటున్నారు. రెండు ప్రధానమైన బ్యాంకులను జూలై 1నే ప్రారంభించారు. కెనరా బ్యాంకును 1906 జూలై 1న ప్రారంభించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను 1955 జూలై 1నే స్థాపించారు. దాంతో ఈ రెండు బ్యాంకులు ఈ రోజును వ్యవస్థాపక దినోత్సవంగా జరుపుకుంటు న్నాయి. ఎంత పెద్ద సంస్థలకైనా, వ్యాపారాలకైనా ఖచ్చితమైన లెక్కలుండాలి. లెక్కతప్పిందా అంతే సంగతులు. అందుకే అంకెల మాంత్రికులుగా పేరొందిన చార్టెర్డ్ అకౌంటెంట్స్ లేకుండా వ్యాపారాల లెక్కలు మాత్రం తేలవు. ఇటువంటివారికి కూడా ఒక రోజుందండోయ్. అదే 'చార్టెర్డ్ అకౌంటెంట్స్ డే'. 1949 జూలై 1న చార్టెర్డ్ అకౌంటెంట్లను స్వతంత్ర ప్రతిపత్తి గల సంస్థగా ఏర్పాటుచేశారు. అప్పటి నుంచి చార్టెర్డ్ అకౌం టెంట్స్ డే నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణాల రూపకర్తలైన ఆర్కిటెక్చర్లకు ఒక ప్రత్యేకమైన రోజుంది. ఆధునిక కాలంలో ఆర్కిటెక్చర్లకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. అందమైన గృహాలు, కట్టడాలు నిర్మించుకునేందుకు జనం పోటీపడుతుండడంతో ఆర్కిటెక్చర్లకు డిమాండు పెరిగింది. అలాగే ప్రతిఏటా జూలై 1న ఆర్కిటెక్చర్స్ డేను నిర్వహించుకుంటారు. ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ఈ రోజుకు మరికొన్ని విశేషాలు ఉన్నాయి. ఇండియాలో తొలిసారిగా పోస్టు కార్డును జూలై 1నే ప్రవేశపెట్టారు. రోదసిలో మృతి చెందిన ప్రముఖ వ్యోమగామి కల్పనా చావ్లా జయంతి కూడా ఇదే రోజు. అదండీ.. జూలై 1కి ఇన్ని ప్రత్యేకతలున్నాయి.



డాక్టర్ బీసీ రాయ్ పేరిట విడుదల చేసిన పోస్టల్ స్టాంపు



చార్టెడ్ అక్కౌంటెంట్స్ డే

ఎస్పీ అంటూ బురిడీ

రూ.2.35లక్షలు స్వాహా

రాజమహేంద్రవరం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఎస్పీనని చెప్పి ఓ వ్యక్తిని బురిడీ కొట్టించి డబ్బులు దోపిడీ చేయడంపై త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మునిసిపల్ కాలనీకి చెందిన ఎస్.పామ్‌రాజ్‌కి గత నెల 17న ఓ ఫోన్‌కాల్ వచ్చింది. నీ బ్యాంకు ఖాతాలో రూ.3కోట్లు జమ అయ్యాయి. అవి ఎక్కడి నుంచి వచ్చాయి. మనీ లాండరింగ్ కేసులో నీ పేరు ఉంది. ఢిల్లీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారని బెదిరించారు. కాసేపటికి ఢిల్లీ నుంచి ఎస్పీని మాట్లాడుతున్నానంటూ ఓ వ్యక్తి వాట్సాప్ కాల్ చేశారు. నీకు అంత మొత్తంలో డబ్బు ఎందుకు వచ్చిందంటూ ప్రశ్నించాడు. పామ్‌రాజ్ చెప్పిన సమాధానంతో ఏకీభవించలేదు. నువ్వు నాకు సహకరిస్తే కేసు లేకుండా చేస్తానని అవతల వ్యక్తి చెప్పాడు. మాటల్లోనే పామ్‌రాజ్ బ్యాంకు ఖాతా వివరాలు తీసుకున్నాడు. ఎస్పీ అనే వ్యక్తి చెప్పిన ప్రకారం రూ.50వేలు, రూ.లక్ష జమ చేశాడు. మళ్లీ అవతల వ్యక్తి ఫోన్ చేసి పెద్ద మొత్తం డిమాండ్ చేయగా.. తన ఖాతాలో రూ.85వేలు మాత్రమే ఉన్నాయంటూ ఆ డబ్బులు కూడా బదిలీ చేశారు. ఇలా మొత్తం రూ.2.35లక్షలు పంపించాడు. తర్వాత అటు వైపు నుంచి ఫోన్ రాలేదు. దీంతో అనుమానించిన పామ్‌రాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. ఇలాంటి ఫోన్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫోన్ వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. భయంతో లేదా అత్యాశతో మోసపోవద్దని ఆయన కోరారు.

డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వోపై విచారణ జరపాలి

ఎటపాక, జూన్ 30 : చింతూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్యపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు డిమాండ్ చేశారు. డాక్టర్ పుల్లయ్య డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వోగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి విలీన మండలాల్లోని ప్రభుత్వ ఆసుపత్రులు, బర్త్ వెయిటింగ్ హాల్స్‌కోసం మంజూరీచేసిన నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. డాక్టర్ పుల్లయ్య తెలంగాణలోని భద్రాచలంలో ఓ ప్రయివేట్ ఆసుపత్రి నడుపుతూ, ఆశ, ఏఎన్ఎంల సాయంతో రోగులను అక్కడికి తరలిస్తుంటారని ఆరోపించారు. త్వరలో స్థానిక ఎమ్మెల్యే శిరీషాదేవితో కలిసి పుల్లయ్యపై వైద్య, ఆరోగ్యశాఖ మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు. ఈవిషయమై డాక్టర్ పుల్లయ్యను వివరణ కోరగా వైఎస్ ఎంపీపీ తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు.

సంతానం కలగడం లేదని ఆత్మహత్య

● కాలువలో దూకిన వివాహిత

ఉండ్రాజవరం, జూన్ 30: సంతానం కలగడంలేదని మనస్తాపం చెందిన ఒక మహిళ కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన దమ్మెన్నులో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోర్త గ్రామానికి చెందిన తోట రాశి(24)కి 2020లో ఉండ్రాజవరం గ్రామానికి చెందిన దుర్గారావుతో వివాహమైంది. నాలుగేళ్లయినా సంతానం కలగకపోవడంతో మనస్తాపం చెంది శనివారం దమ్మెన్ను గ్రామం వద్ద నరసాపురం కాలువలో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె మృతదేహం ఆదివారం లభ్యమయ్యింది. ఆమె తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఉండ్రాజవరం పోలీసులు తెలిపారు.

ఉన్నత విద్యలతోపాటు సమాజంలోని మార్పులు ఆకళింపు చేసుకోవాలి

● ఆర్యవైశ్య మెరిట్ విద్యార్థుల సన్మాన సభలో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



విద్యార్థికి ప్రతిభా అవార్డు అందజేస్తున్న శ్రీఘాకోళ్ళపు శివరామ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం, జూన్ 3)(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యను అభ్యషించడంతోపాటు సమాజంలోని మార్పులు గమనిస్తూ, అన్ని అంశాలను ఆకళింపు చేసుకుని ఆయా రంగాలలో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆర్యవైశ్య విద్యార్థులకు ఏపీ ఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఉద్బోధించారు. స్థానిక లాలాచెరువులోని ఆర్యవైశ్య హాస్టల్‌లో ఆదివారం ఆర్యవైశ్య అఫిషియల్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్మీడియట్ నుంచి ట్రిపుల్ ఐటీ వరకూ వివిధ స్థాయిలలో ఉత్తమ ఫలితాలు సాధించిన 60 మంది ఆర్యవైశ్య విద్యార్థులకు అవార్డుల ప్రదానం సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అసోషియేషన్ అధ్యక్షుడు పి.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈసభలో విద్యార్థులకు ప్రతిభా అవార్డులను అందజేశారు. గుంటూరు రెమాండ్స్ మెన్స్ టచ్ మేనేజింగ్ పార్టనర్ టి.అరుణకుమార్, పువ్వాడి చంద్రశేఖర్, పి.కనకరాజు, ఆర్. సుబ్బారావు, ఈ. శంకరనారాయణ, వి.నాగమణి, కేవీ గోపాలకృష్ణ, కె.కనకేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పు అధ్యకుడిగా మళ్లీ కంచర్ల బాబి ఏకగ్రీవం



ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబీ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సుమారు 300 మంది ప్రతి నిధులు ఈసభలో పాల్గొన్నారు. శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఆర్య వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు తదితరులు బాబిని అభినందించారు. రాష్ట్రంలో ఆర్యవైశ్యులు రెండుగా వర్గాలుగా ఉండడం వల్ల వారిని ఐక్యం చేయవలసిన అవసరం ఉందని ప్రధానవక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. రెండురోజులలో హైదరాబాద్‌లో చర్చలు మొదలు కానున్నట్టు తెలిపారు.

ట్యాంకర్ ఢీకొని తాత, మనవడు మృతి



సంఘటనా స్థలంలో పడివున్న తాతా, మనవడిల మృతదేహాలు





మాసా వీర్రాజు, పాముల ధనుష్ చంద్ర (ఫైల్)

కొవ్వూరు, జూన్ 30: మోపెడ్‌ను లారీ ఢీకొన్న ఘటనలో తాత, మనువడు మృతిచెందినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీకి చెందిన మాసా వీర్రాజు (44) ఆదివారం కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో ఉన్న కుమార్తె ఇంటికి భోజనానికి వెళ్లాడు. తిరిగి స్వగ్రామం వస్తూ ఆరో తరగతి చదువుతున్న మనవడు పాముల ధనుష్‌చంద్ర(11)ను తీసుకుని మోపెడ్‌పై బయలుదేరారు. ఆరికిరేవుల గ్రామంవద్ద గోదావరి ఏటిగట్టు రోడ్డుపై ఎదురుగా వస్తున్న ట్యాంకరు ఢీకొనడంతో ఇద్దరు కింద పడిపోయారు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడ మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు ధనుష్ చంద్ర తండ్రి పాముల సుబ్రహ్మణ్యం ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

డివైడర్‌ను కారు ఢీకొని ఒకరి మృతి

మరో ఘటనలో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు మృతి చెందినట్టు సీఐ తెలిపారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం (అంకంపాలెం) లోని పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గండికోట ఎస్వీ జోగినాథం(28) ఈనెల 29న కారులో రాజమహేంద్రవరం షాపింగ్‌కు వచ్చాడు. షాపింగ్ పూర్తిచేసుకుని కల్కి సినిమా సెకండ్ షో చూసి తిరిగి జంగారెడ్డిగూడెం వెళ్తుండగా అర్ధరాత్రి కొవ్వూరులోని ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కాలేజీ సమీపంలో కుక్క అడ్డురావడంతో సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో జోగినాథానికి తీవ్ర గాయాలై పడి ఉన్నాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఓ డాక్టర్ ఆయనను పరిశీలించి మృతి చెందినట్టు చెప్పారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి తండ్రి గండికోట శ్రీరామ సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్ఐ జుబేర్ మహ్మద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఏజెన్సీలో భారీ వర్షం

● నెల్లిపాక ప్రధాన రహదారిపై కూలీన భారీ వృక్షం

● ఆరేడు గంటలపాటు స్తంభించిన రాకపోకలు



రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను యంత్రాలతో తొలగిస్తున్న దృశ్యం



భారీవృక్షం రహదారిపై పడడంతో నిలిచిపోయిన వాహనాలు

ఎటపాక, జూన్30: ఏజెన్సీలోని ఎటపాక మండలంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం అర్ధరాత్రి సమ యంలో భారీ వర్షంపడడంతో కుంటలు, చెరువులు నిండాయి. వాగులు పొంగిపొర్లాయి. వర్షం దాటికి నెల్లిపాక సమీపంలో భద్రాచలం-కూనవరం రోడ్‌లో భారీ వృక్షం నెలకూలింది. దాంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి సుమారు ఆరేడు గంటల పాటు ఈ రహదారిపై రాకపోకలు స్తంభించాయి.

వనువులమ్మ ఆలయ వార్షికోత్సవం

ముమ్మిడివరం, జూన్ 30: సీహెచ్ గున్నేపల్లిలో వనువులమ్మతల్లి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయం వద్ద అమ్మవారికి కుంకుమ పూజలు, ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం భజన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేడు పింఛన్ల పంపిణీ

ముమ్మిడివరం, జూన్ 30: గ్రామాల్లో సోమవారం నిర్వహించే పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బందితో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లాలని పలువురు వక్తలు సూచించారు. అనాతవరంలో కురసాల శివబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీపార్టీల నాయకులు, కార్యకర్తల సమావేశంలో వక్తలు మాట్లాడుతూ సూపర్-6 పథకాల అమలులో భాగంగా పెంచిన పింఛన్లు పంపిణీ చేస్తున్నందున చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు సమావేశం అభినందనలు తెలిపింది. రూ.3వేలు ఉండే దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలుకు పెంచిన ఘనత కూడా కూటమి ప్రభుత్వానిదే నన్నారు. కార్యక్రమంలో మిమ్మితి చిరంజీవి, గుబ్బల తాతబ్బాయి, యాళ్లసుభాష్, పేరిచర్ల సురేష్‌రాజు, గంధం శ్రీను, అడబాల నాని, మట్టపర్తి ఈశ్వరి, అందే శ్రీను, నిమ్మన వెంకటేశ్వరరావు, నక్కా సతీష్, బొక్కా శివ, పసుపులేటి శ్రీను పాల్గొన్నారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): రామచంద్రపురం నియోజకవర్గంలో 35,743మంది పింఛన్‌దారులకు రూ.23,38,29,500 పంపిణీ చేయనున్నారు. రామచంద్రపురం పట్టణంలో 4837 మందికి, మండలంలో 10628 మందికి, కె.గంగవరం మండలంలో 10,092మందికి, కాజులూరు మండలంలో 10186 మందికి పింఛన్లు సోమవారం అందచేస్తారు. 3నెలల పెంపుతో సాధారణ పింఛన్లకు రూ.7వేలు ఇస్తారు. పట్టణంలో కొత్తూరు, కె.గంగవరం మండలంలో పాణింగిపల్లిలో మంత్రి సుభాష్ పింఛన్లు అందజేస్తారు. పింఛన్ల పంపిణీలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని మంత్రి కోరారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదివారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. పింఛన్ల పంపిణీలో ప్రతీ కార్యకర్త పాల్గొనాలని కోరారు.

అల్లవరం: డి.రావులపాలెం నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సోమవారం శ్రీకారం చుడతారని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవగుప్తం, యెంట్రుకోన, అల్లవరం మసీదు, గుడ్డివానిచింత, కోడూరుపాడు ప్రాంతాల్లో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పింఛన్లు అందజేస్తారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు, కార్యకర్తలు విధిగా పాల్గొనాలని టీడీపీ మండల అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు పిలుపునిచ్చారు.

అమలాపురం రూరల్: ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో కూటమి శ్రేణులంతా పాల్గొనాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి చంద్రమౌళి పిలుపునిచ్చారు. ఆదివారం పేరూరులో కూటమి శ్రేణుల సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి ఆదేశాల మేరకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు పెన్షన్ల పంపిణీ పండగలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు మొయిల శివ, మంథా ఫణికుమార్, దేవరపల్లి వీరేష్‌కుమార్, పనసా బుజ్జి పాల్గొన్నారు.

కె.గంగవరం: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పండుగను సోమవారం మంత్రి వాసంశెట్టి సుభాష్ పాణింగపల్లి గ్రామంలో ప్రారంభిస్తారు. ఆయన ఇంటింటికీ తిరిగి పింఛన్లు పంపిణీ చేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఎంపీడీవో ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో పింఛన్ల పంపిణీకి ఎంఈవో-2 చోడిశెట్టి ఆంజనేయులను ప్రత్యేక అధికారిగా నియమించారు.

మండపేట: మండపేట నియోజకవర్గంలో సోమవారం ఉదయం నుంచి పింఛన్ల పంపిణీకి ఏర్పాట్లు చేశారు. మండపేట పట్టణంలోని 6వ సచివాలయం పరిధిలో సోమవారం ఉదయం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పింఛన్లు పంపిణీ చేస్తారు. మండపేటలో 6,916మందికి, మండలంలో 12,123మందికి పింఛన్లు అందజేస్తారు. మండపేటలో 128మంది సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పింఛన్లు పంపిణీ చేస్తారని కమిషనర్ తెలిపారు.

అంతర్వేది: రాజోలు నియోజకవర్గంలో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సోమవారం ఉదయం 9 గంటలకు సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, మోరిపోడు గ్రామాల్లో, ఉదయం 10గంటలకు రామరాజులంక, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో, 11గంటలకు శివకోటి, 12గంటలకు మామిడికుదురులో లబ్ధిదారుల ఇంటింటికీ వెళ్లి పెన్షన్ పంపిణీ చేయనున్నారు. పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, కూటమి శ్రేణులు పాల్గొనాలన్నారు.

రాజోలు: జూలై నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లు సోమవారం లబ్ధిదారులకు ఇంటి వద్దకు వెళ్లి అందజేస్తామని ఎంపీడీవో ఎన్.బాలాజీ ఆదివారం తెలిపారు. మండలంలో 9,732మంది లబ్ధిదారులకు రూ.6,35,18,000 అందజేస్తారన్నారు. మండలంలో 16 గ్రామాల్లో ఉన్న 22సచివాలయాలకు 180మంది సచివాలయ ఉద్యోగులను నియమించామని తెలిపారు.

మంచినీటి ప్రాజెక్టులపై అధికారుల నిర్లక్ష్యం

- గట్టు జారిన గుండెపూడి ప్రాజెక్టు
- ప్రాజెక్టు చుట్టూ పెరిగిన తుప్పలు


బోడసకుర్రు ప్రాజెక్టు మంచినీటి చెరువుగట్టుపై పెరిగిన తుప్పలు


అల్లవరం మండలం గుండెపూడిలో కుంగిన ఆర్‌డబ్ల్యుఎస్ మంచినీటి రిజార్వుయరు గట్టు

అల్లవరం, జూన్ 30: అల్లవరం గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీరు అందించే ప్రధానమైన రక్షిత మంచి నీటి ప్రాజెక్టుల వద్ద సమస్యలు తిష్ట వేశాయి. ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలోని అల్లవరం మండలం గుండెపూడి వద్ద రక్షిత మంచినీటి ప్రాజెక్టు రిజర్వాయరు (చెరువు) లోపల గట్టు జారి 20మీటర్ల పొడువునా దిగబడి ఏడాది దాటినా నేటికీ మరమ్మతులు లేవు. గడిచిన వేసవి కాలంలో ఎటువంటి మరమ్మతులు చేపట్టకుండా వదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. టీడీపీ పాలనలో నిర్మించిన ఈప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారులు సైతం గాలికొదిలేశారన్న విమర్శలు ఉన్నాయి. 2001లో రూ.5.35కోట్లతో గుండెపూడి వద్ద రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని అప్పటి కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి ఎం.వెంకయ్యనాయుడు ప్రారంభించారు. అప్పట్లో లోక్‌సభ స్పీకర్ బాలయోగి ప్రోద్బలంతో గుండెపూడి ప్రాజెక్టు ద్వారా నేరుగా 16గ్రామాలకు తాగునీరు సరఫరా జరిగేది. బోడసకుర్రులో 15ఏళ్ల క్రితం నిర్మించిన ప్రాజెక్టు రిజర్వాయరు గట్టు పిచ్చి మొక్కలు, తుప్పలు పెరిగి అధ్వానంగా మారింది. బోసడకుర్రు ప్రాజెక్టు వద్ద నీటిని సరిగా ఫిల్టర్ చేయక తరచూ మురికి నీరు వస్తుందన్నారు. గుండెపూడి ప్రాజెక్టు గట్టును పటిష్ట పరచాలని, బోడసకుర్రు ఆర్‌డబ్ల్యుఎస్ ప్రాజెక్టు వద్ద తుప్పలు తొలగించాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గుండెపూడి ప్రాజెక్టు వద్ద దిగజారిన గట్టుకు ఎటువంటి మరమ్మతులు లేవని ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ జి.స్వామి అన్నారు. స్టోరేజ్ రిజర్వాయరు లోపల రక్షణగోడ నిర్మాణానికి రూ.3 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు.

సక్షమ్ వ్యవస్థాపక దినోత్సవం


మోటూరి వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న సక్షమ్ ప్రతినిధులు

అమలాపురం రూరల్, జూన్ 30: ఈదరపల్లిలోని జనహిత కార్యాలయంలో ఆదివారం సక్షమ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా హాజరైన సభకు డాక్టర్ సత్యప్రభ అధ్యక్షత వహించారు. సక్షమ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు అందిస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. దివ్యాంగ సంఘాలన్నింటినీ కలుపుకుని 2016 చట్టం అమలుకు కృషి చేస్తామన్నారు. దివ్యాంగుల కోసం కృషి చేస్తున్న నిమ్మకాయల సురేష్, మోటూరి వెంకటేశ్వరరావు, కొసన సుబ్రహ్మణ్యం, కె.నాగరాజు, పెనుమాల నాగరాజు, నల్లా నాయుడు, కాంగ్రేగుల మణికంఠస్వామిలను సత్కరించారు. జిల్లా కార్యదర్శి రాఘవేంద్రరావు, కోశాధికారి తులసి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమం టీడీపీతోనే సాధ్యం: బుచ్చిబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

ఐ.పోలవరం, జూన్ 30: పేదల సంక్షేమం టీడీపీ పాలనతోనే సాధ్యమని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. మురమళ్ళ క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన పార్టీ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలుచేయడం ప్రారంభించారన్నారు. జూలై ఒకటో తేదీన పెంచిన పెన్షన్లు పంపిణీ చేస్తామన్నారు. లబ్ధిదారుల ఇంటికి సచివాలయ ఉద్యోగులు వెళ్లి పెన్షన్ల సొమ్ము పంపిణీ చేస్తారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 42,273మందికి రూ.28.11కోట్లు పంపిణీ చేస్తారన్నారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు నాగిడి నాగేశ్వరరావు, గుత్తుల సాయి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొలకోటి దొరబాబు, మందాల గంగసూర్యనారాయణ, తాడి నరసింహారావు, చెల్లి అశోక్, పొద్దోకు నారాయణరావు, సాగిరాజు సూరబాబురాజు, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, అర్ధాని శ్రీనివాసరావు, నడింపల్లి సుబ్బరాజు, దొమ్మేటి రమణకుమార్, ఆకాశం శ్రీనివాస్, టేకుమూడి లక్ష్మణరావు, ధూళిపూడి చక్రం, ధూళిపూడి బాబీ, కాకర్లపూడి రాజేష్, గంజా సుధాకర్, గోదశి పుండరీష్, రంబాల రమేష్, ముత్యాల జయలక్ష్మి, బీర సత్యకుమారి, సాక సీతాదేవి, చిక్కాల అంజిబాబు పాల్గొన్నారు.

ఎస్.యానాన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తా


ఎమ్మెల్యే ఆనందరావును సన్మానిస్తున్న ప్రజలు

ఉప్పలగుప్తం, జూన్ 30: తీర ప్రాంత గ్రామమైన ఎస్.యానాన్ని మోడల్ విలేజ్‌గా అభివృద్ధి చేస్తానని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఎమ్మెల్యేగా తొలిసారి ఆదివారం ఆయన తన స్వగ్రామానికి వెళ్లి గ్రామస్తులతో మమేకమయ్యారు. టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు లంకే భీమరాజు ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో గ్రామస్తులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఇంటి వద్దే పెన్షన్ల పంపిణీలో కూటమి శ్రేణులు భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. తన హయాంలో ప్రారంభించి సగంలో నిలిచిన బీచ్ రోడ్డు నిర్మాణం పూర్తి చేసేందుకు పీఆర్ డీఈఈ రాజ్‌కుమార్, ఏఈ రాధాకృష్ణలతో కలిసి ప్రారంభ పూజ చేశారు. టీడీపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, దంగేటి చిట్టిబాబు, పలచోళ్ల పద్మనాభం, పినిశెట్టి నరసింహారావు, ఉలిశెట్టి దొరబాబు, దెందుకూరి సత్తిబాబురాజు, పలచోళ్ళ బుజ్జి, పలచోళ్ల నారాయణరావు,జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

వృత్తి కళాకారుల డిమాండ్లు పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మంగం సత్యనారాయణ

మామిడికుదురు, జూన్ 30: వృత్తి కళాకారుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోనసీమ వృత్తి కళాకారుల సాంస్కృతిక సంక్షేమ సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు మంగం సత్యనారాయణ కోరారు. మామిడికుదురులోని అంబేడ్కర్ సామాజిక భవనంలో సంఘ సమావేశం ఆదివారం జరిగింది. సమావేశంలో ఆయన మాట్లాడుతూ వృత్తికళాకారులకు పెన్షన్‌ను రూ.6వేలకు పెంచడంతో పాటు పెన్షన్ అర్హత 50ఏళ్లకు తగ్గించాలని, కళాకారులకు ఇళ్లస్థలాలతో పాటు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, హెల్త్‌కార్డులు అందించి ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే గుర్తింపు కార్డుల ద్వారా బస్సు, రైళ్లలో 50శాతం రాయితీ కల్పించాలన్నారు. సంఘ కార్యదర్శి వాసంశెట్టి శంకరరావు, ఉపాధ్యక్షుడు అడబాల సత్యనారాయణమూర్తి, దూనబోయిన వీరరాఘవులు, సరిదే సత్యవతి, సారే రాణి, ఎస్.లక్ష్మి పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం

పి.గన్నవరం, జూన్ 30: మానేపల్లి గోదావరి నది పరివాహక ప్రాంతంలో ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను కందాలపాలెం వద్ద రెవెన్యూ సిబ్బంది ఆదివారం స్వాధీనం చేసుకున్నట్లు తహశీల్దార్ ఎస్కే హుస్సేన్ తెలిపారు. తదుపరి చర్యలకు పోలీసులకు సిఫార్సు చేశామన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ఆత్రేయపురం: పులిదిండిలో బండారు కృతజ్ఞతా పర్యటన, కొత్తపేట: అభినందన సభలో మాట్లాడుతున్న బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, జూన్ 30: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం ద్వారా సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన పులిదిండిలో కృతజ్ఞతా పర్యటన చేశారు. గ్రామస్తులు, పార్టీ శ్రేణులు బండారుకు అపూర్వ స్వాగతం పలికారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చారిత్రాత్మక గెలుపును అందించిన ప్రజలకు తాను రుణపడి ఉంటానన్నారు. మేనిఫెస్టోలోని హామీలను చంద్రబాబు నెరవేరుస్తారన్నారు. నియోజకవర్గంపై పూర్తి అవగాహన కలిగి ఉన్నానని, ఐదేళ్లలో ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కనుమూరిరామలింగరాజు, కనుమూరి తిరుపతిరాజు, తోట రజనీ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తా

కొత్తపేట, జూన్ 30: ప్రజలిచ్చిన అవకాశాన్ని ప్రజల కోసం వినియోగిస్తూ నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తానని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. ఆదివారం ఆయన బిళ్లకుర్రు గ్రామంలో పర్యటించగా నాయకులు, కార్యకర్తలు, మహిళలు నీరాజనాలు పలికారు. ఈసందర్భంగా జరిగిన అభినందన సభలో సత్యానందరావు మాట్లాడుతూ బిళ్లకుర్రలో పదేళ్ల క్రితం జరిగిన అభివృద్ధి తప్ప కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిష్కరిస్తానన్నారు. గ్రామస్తులు పూలమాలలు, దుశ్శాలువాలతో బండారును సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, పల్లి భీమారావు, రెడ్డి రామకృష్ణ, సత్తిరాజు ఉషారాణి, ఎలిశెట్టి రామకృష్ణ, సరెళ్ల రాజబాబు, రెడ్డి తాతాజీ, రెడ్డి శ్రీనివాస్, కముజు గంగాధర్, గుబ్బల మూర్తి, బొక్కా వెంకటకుమార్, కందికట్ల సత్యవతి, అద్దంకి చంటిబాబు, బూసి విష్ణు, ఎన్.మేరిసుశీలరాణి, నల్లం బాల, సూరవరపు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీ-20 విజయంతో అభిమానుల సంబరాలు


అమలాపురంలో క్రికెట్ అభిమానుల సంబరాలు

అమలాపురం టౌన్, జూన్ 30: భారత క్రికెట్ జట్టు టీ-20 ప్రపంచ కప్ సాధించడంతో క్రికెట్ అభిమానులు ఆదివారం సంబరాలు చేసుకున్నారు. అమలాపురం గడియారస్తంభం సెంటర్లో జనసేన నాయకులు, కార్యకర్తలు జాతీయ పతాకాలను చేతబూని వేడుకలకు హాజరయ్యారు. భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేస్తూ టీమ్ ఇండియాకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ మిఠాయిలు పంచారు. నాయకులు పిండి రాజా, ఆకుల బుజ్జి, బీజేపీ నాయకులు యల్లమిల్లి నాగుసుధాకొండలరావు, కాశినపణీంద్ర, కొత్తపల్లి వంశీ, జనసైనికులు చింతపల్లి చిన్నా, లింగోలు కృష్ణ, మహ్మద్‌షరీఫ్, తిక్కా సరస్వతి, వలవల చిన్నా, షఫీ, కరీముల్లాబాబా, జాంబ, తోట గణేష్, అడపా శివ, కైరం సత్య తదితరులు పాల్గొన్నారు. టీమిండియా విజయం సాధించడంతో కోనసీమ జేఏసీ కార్యాలయంలో కన్వీనర్ బండారు రామ్మోహనరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. యువ క్రికెటర్లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. స్వీట్లు పంచారు. జేఏసీ సభ్యులు డాక్టర్ మధుర నరసింహమూర్తి, నంద్యాల నాయుడు, టి.సుందరరామయ్య, కరాటం ప్రవీణ్, సంసోను తదితరులు పాల్గొన్నారు.

సొసైటీల పర్సన్ ఇన్‌చార్జులు వీరే

ఉప్పలగుప్తం, జూన్30: నామినేటెడ్ త్రిసభ్య కమిటీల రాజీనామాతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జులను నియమిస్తూ డివిజన్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణరావు ఉత్తర్వులు జారీచేశారు. మండలంలోని పెదగాడవిల్లి, ఉప్పలగుప్తం సంఘాలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్‌బాబు, గోపవరం, ఎస్.కొత్తపల్లి, భీమనపల్లి సంఘాలకు అసి స్టెంట్ రిజిస్ట్రార్ వి.రమేష్‌బాబు, గొల్లవిల్లి, కూనవరం సంఘాలకు సీనియర్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ఆర్ఎస్ రజని నియమితులయ్యారు.

సర్పంచ్‌ల చూపు టీడీపీ కూటమి వైపు

అల్లవరం, జూన్ 30: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం ఓటమి చెందడంతో ఆ పార్టీకి చెందిన పలువురు సర్పంచ్‌లు టీడీపీ-జనసేన పాలనవైపు మొగ్గుచూపుతున్నారు. మరో రెండేళ్లలో సర్పంచ్‌ల పదవీ కాలం ముగుస్తుండడంతో గ్రామాభివృద్ధి దృష్ట్యా తమ హయాంలో ఏమీ చేయలేదన్న నింద రాకుండా ప్రగతి బాటలో పయనించాలన్న ఆశయంతో కూటమిలో చేరేందుకు ఆ పార్టీల నాయకులతో టచ్‌లో ఉన్నారు. వైసీపీ పాలనలో పంచాయతీల నిధులను మళ్లించి వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో పలువురు సర్పంచ్‌లు కూటమివైపు దృష్టిసారించారు. ఇంతవరకు నిధులురాక గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి లేకపోవడం, ఇళ్ల నిర్మాణాలు జరపకపోవడం వెలితిగా మారింది. ప్రజలు ప్రశ్నించకుండా చివరి దశలో అభివృద్ధి పనులు చేయించుకునేందుకు టీడీపీ కూటమిలో చేరేప్రయత్నాలు చేస్తున్నారు. మొన్న ఎన్నికల్లో వైసీపీ పక్షాన నిలిచి ముమ్మర ప్రచారం చేసిన సర్పంచ్‌లను కూటమిలో చేర్చుకునేందుకు ఆయా శ్రేణులు ససేమిరా అంటున్నాయి. చేర్చుకోవద్దని కరాఖండిగా చెప్తున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యే, నాయకులతో టచ్‌లో ఉండి పైరవీలు చేస్తున్నారు. ఐదేళ్లలో తమ పార్టీలకు సహకరించని మండలస్థాయి అధికారులను బదిలీచేసే వ్యూహం నడుస్తోంది.

ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

ముమ్మిడివరం, జూన్ 30: గేదెల్లంక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం చేకూరి విశ్వేశ్వరరావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం పాఠశాల కమిటీ, ఉపాధ్యాయులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానసభలో పలువురు వక్తలు మాట్లాడుతూ విశ్వేశ్వరరావు విద్యార్థులు అభివృద్ధికి అందించిన సేవలను కొనియాడారు. కోలా బాబ్జి, గుద్దటి జమి, గుద్దటి వీరాస్వామినాయుడు, విద్యాకమిటీ ఛైర్మన్ గుద్దటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయంలో కమలానంద భారతి పూజలు

అంతర్వేది, జూన్ 30: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కేసపల్లి భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతిస్వామి విచ్చేశారు. ఆయనకు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. సంప్రదాయ, మర్యాదలతో ఆలయ ప్రదక్షిణ చేసి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు మహదాశీర్వచనం అందించారు. ఆలయ అర్చకులు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, సూపరింటెండెంట్ పి.విజయసారథి, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	: కల్కి 2898 ఏడీ
శ్రీలలిత	: మహారాజ
శేఖర్ స్ర్కీన్-1	: కల్కి 2898 ఏడీ
శేఖర్ స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ
రమా	: ప్రభుత్వ జూనియర్ కళాశాల
గణపతి	: హరోం హర
వెంకటపద్మావతిస్ర్కీన్-1	: కల్కి 2898
వెంకటపద్మావతి స్ర్కీన్-2	: కల్కి 2898 ఏడీ

హృదయాన్ని స్పందింప చేసేదే కవిత్వం

అమలాపురం టౌన్, జూన్ 30: మారుతున్న కాలానికి అనుగుణంగా కవితా విధానంలో మార్పులు అవసరమని శ్రీశ్రీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. మారుతున్న పాఠకుల అభిరుచులకు అనుగుణంగా హృదయాన్ని స్పందింపచేసే విధంగా కవిత్వం సాగాలన్నారు. అమలాపురం గాంధీ బజార్‌లోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో శ్రీశ్రీ కళా వేదిక, కోనసీమ రచయిత సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కవిత్వ శిక్షణ ఇచ్చారు. ప్రముఖ కవుల గురించి డాక్టర్ బీవీవీ సత్యనారాయణ వివరించారు. పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, చిక్కాల రవిశంకర్, గున్నేపల్లి భీమశంకరం, యువ కవులు పాల్గొన్నారు. కవితా విధానంపై విద్యార్థులకు పోటీలు నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ.35వేలు విరాళం

మామిడికుదురు, జూన్ 30: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన దిగుమర్తి శ్రీనివాస్-పద్మావతి దంపతులు రూ.35వేలు విరాళంగా అందించారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో బొక్కా సత్యంమూర్తి, వేదపండితులు జోష్యుల సోమయాజులు తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు

మామిడికుదురు, జూన్ 30: అప్పనపల్లి బాలబాలాజీ సన్నిధిలో కల్యాణ వేదిక వద్ద జూలై 3వ తేదీ సాయంత్రం 6.30నుంచి 8.30గంటల వరకు శ్రీవెంకటేశ్వర వైభవంపై చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి ఓ ప్రకటనలో తెలిపారు.

రమణయ్యకు ఘన నివాళి

యానాం, జూన్ 30: స్వాతంత్ర్య సమరయోధుడు దడాల రమణయ్య(రఫేల్) జయంతి సందర్భంగా స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యాక్రమంలో యానాం సమాచారశాఖ అధికారి కె.ఎల్.వి.ప్రసాద్, ఎస్ఐ కవల రమణమూర్తి, చెల్లి గోపినాద్, శివ పాల్గొన్నారు.

రెండేళ్ల బాలుడికి సాయం

అంబాజీపేట, జూన్30:ఇమ్మిడివరప్పాడుకు చెందిన సిర్రా ఏడుకొండలు కుమారుడు రాజేష్ మెదడువాపు వ్యాధితో బాధపడుతోన్నాడు. రెండేళ్ల బాలుడికి కె.పెదపూడికి చెందిన ఈతకోట సత్యనారాయణ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.12వేలు అందించారు. ఈతకోట నాగరాజు, సబ్‌రిజిష్ట్రార్ రాయిరాంబాబు, నవుండ్రు నాగరాజు, నందెపు రమణ, ఈ.రాంచరణ్ పాల్గొన్నారు.

గురువే ప్రత్యక్ష దైవం

కొత్తపేట, జూన్ 30: విద్యార్థులకు విద్యా బుద్ధులు నేర్పే గురువులే ప్రత్యక్ష దైవాలని, వారి సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంఈవో హరిప్రసాద్ ఆధ్వర్యంలో మోడేకుర్రు ఎంపీపీ స్కూలు హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఎంవీవీ సత్యనారాయణ, వానపల్లి శివారు సంగంపాలెం స్కూలులో పనిచేస్తున్న హెచ్‌ఎం వాసంశెట్టి వెంకటరమణ ఉద్యోగవిరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వారిని ఎమ్మెల్యే బండారు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు, సాదే లక్ష్మీశ్రీనివాస్, నాగాబత్తుల చంద్రకుమారి, కంఠంశెట్టి శ్రీనివాస్, ధర్నాల రామకృష్ణ, ఎస్.జ్యోతిబసు, పి.వెంకటేశ్వరరావు, వి.బాలకృష్ణ, జి.నారాయణ, వై.మురళీ, వై.బాలాజీ పాల్గొన్నారు.

17గ్రామాల్లో పింఛన్ల పంపిణీ

ఆత్రేయపురం, జూన్ 30: మండలంలో పెన్షన్ల పంపిణీకి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం శ్రీకారం చుట్టనున్నారు. ఉదయం 9గంటలకు ఆయన ఆత్రేయపురంలో పెన్షన్లు అందజేస్తారు. 17 గ్రామాల్లో 197మంది సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 9,850 మందికి పింఛన్లు అందజేస్తారు.

దేశానికి గర్వకారణం

రామచంద్రపురం, జూన్30: ఇండియా టీ20 ప్రపంచ కప్ సాధించడం భారతీయులందరికీ గర్వకారణమని మోడరన్ విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు అన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ సారథ్యం నేటి యువతకు ఆదర్శమన్నారు. జట్టులో ప్రతీ క్రీడాకారుడు భారతీయుల కలలను నిజం చేశారన్నారు.

వైభవంగా శ్రీముత్యాలమ్మ తీర్థమహోత్సవం


అమ్మవార్ని దర్శించుకుంటున్న మంత్రి సుభాష్

పి.గన్నవరం, జూన్30:ముంగండ గ్రామదేవత శ్రీముత్యాలమ్మ తీర్థమహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. కొన్నిరోజులుగా అమ్మవార్కి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. గ్రామస్తులు నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్ బాబు, మాజీ ఎంపీపీ అంబటి భూలక్ష్మి, నంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు, బొంతు పెదబాబు, శేరు శ్రీనుబాబు, అంబటి కోటేశ్వరావు, పెచ్చెట్ట వెర్రియ్య, నేలపూడి దుర్గారావు, నిమ్మ కాయల శేషు, మణికంఠ అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా మురుగులమ్మ ఆలయ వార్షికోత్సవం

అంబాజీపేట, జూన్ 30: ఇరుసుమండ గ్రామదేవత శ్రీమురుగులమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవార్కి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్కి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

ధాన్యం సొమ్ములు విడుదలచేసి రైతులను ఆదుకోవాలి


మంత్రి నాదెండ్ల మనోహర్‌తో మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్

రావులపాలెం, జూన్ 30: వైసీపీ ప్రభుత్వం పాలనా సమయంలో రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేసి సొమ్ములు చెల్లించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే విడుదల చేసి ఆదుకోవాలని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను జనసేన కొత్తపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్ కోరారు. శనివారం ఆయన కాకినాడలోని జీఆర్టీ కన్వెన్షన్ హాలులో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. రైతులకు సొమ్ములను నాలుగైదు రోజుల్లో చెల్లించేలా చర్యలు తీసుకుంటామని నాదెండ్ల తెలిపారన్నారు. బండారు వెంట జనసేన రావులపాలెం మండల శాఖ అధ్యక్షుడు తోట స్వామితో పాటు పలువురు వున్నారు.

టీడీపీ నాయకుడు కొండయ్య మృతి




ఐ.పోలవరం, జూన్ 30: గోగుల్లంక టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు సుంకర కొండయ్య(65) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి కొండయ్య గ్రామకమిటీ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. ఆదివారం కొండయ్య మృతదేహానికి ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. గుత్తెనదీవి సర్పంచ్ లంకలపల్లి దుర్గాదేవిమునిరాజు, సాధనాల త్రిమూర్తులు, గంగాబత్తుల సన్యాసిరావు తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

పుదుచ్చేరిలో హోంగార్డు రాత పరీక్ష

రెండు నిమిషాలు ఆలస్యంతో పరీక్షకు ఇద్దరికి అనుమతి నిరాకరణ

యానాం, జూన్ 30: పుదుచ్చేరి పోలీస్ శాఖ గత ఏడాది అక్టోబరు నెలలో రాష్ట్రవ్యాప్తంగా 420 హోంగార్డు పోస్టులకు నోటిఫికేషన్ జారీచేసింది. (యానాం పరిధిలో 25 పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు గ్రౌండ్‌టెస్ట్ నిర్వహించి రాతపరీక్షకు ఎంపికచేశారు. ఆదివారం రాత పుదుచ్చేలో నిర్వహించారు. రాత పరీక్ష రాసేందుకు పలువురు అభ్యర్థులు యానాం నుంచి పుదుచ్చేరి వెళ్లారు. మెట్టకుర్రుకు చెందిన వైష్ణవ్, అఖిల్ పరీక్ష కేంద్రానికి చేరుకునే సమయానికి రెండు నిమిషాలు ఆలస్యమైంది. దీంతో అధికారులు వారిని రాత పరీక్షకు అనుమతి ఇవ్వలేదు. చదివిన కష్టం వృథా అయిందని కన్నీరు మున్నీరు అయ్యారు. హోంగార్డు రాతపరీక్ష యానాంలో నిర్వహించాలని పలువురు కోరుతున్నారు.

ఆలయంలో హైకోర్టు జస్టిస్ రవీంద్రబాబు పూజలు


జస్టిస్ రవీంద్రబాబు దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అంతర్వేది, జూన్30: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జస్టిస్ ఏవీ రవీంద్రబాబు కుటుంబ సమేతంగా విచ్చేశారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం స్వామిని దర్శించుకుని వేదపండితులు మహదాశీర్వచనం అందించారు. జస్టిస్ దంపతులకు స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని ఆలయ సూపరింటెండెంట్ పి.విజయసారథి అందించారు. డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్, రాజోలు కోర్టు సూపరింటెండెంట్ ముప్పర్తి శ్రీను పాల్గొన్నారు.

వెంకన్న అన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

అంతర్వేది, జూన్ 30: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి విశాఖపట్నానికి చెందిన కర్రి ఊగంటేశ్వరరావు-గుణవతి దంపతులురూ.1,00,116 విరాళం సమర్పించారు. దాతలకు స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఆదాయం రూ.2,39,532 లభించినట్టు ఉపకమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు.

వర్షంతో జలమయమైన రోడ్లు


పెదపట్నంలంకలో ఓ రోడ్డుపై వర్షం నీరు

మామిడికుదురు, జూన్ 30: ఆదివారం తెల్లవారుజాము నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పలు గ్రామాల్లోని రోడ్లు జలమయం అయ్యాయి. ప్రధాన రోడ్లపై భారీ వర్షపు నీరు చేరడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పెదపట్నంలంక, మామిడికుదురు, నగరం, పాశర్లపూడి, అప్పనపల్లి గ్రామాల్లోని రోడ్లపై వర్షం నీరు చేరడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.